క్లుప్తంగా

కేసీఆర్ రోడ్‌షోకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



దామెర: హనుమకొండలో నిర్వహించిన కేసీఆర్ రోడ్‌షోకు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు ఆదివారం తరలివెళ్లారు. వెళ్లినవారిలో దామెర నుంచి జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, గ్రామపార్టీ అధ్యక్షకార్యదర్శులు బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, నాయకులు మేరుగు సంతోష్, సంపత్, ఐలయ్య, కిషోర్, రవి, ఆనందం, వీరస్వామి తదితరులు ఉన్నారు. ల్యాదెళ్లలో ఎంపీపీ కాగితాల శంకర్, దుర్గంపేటలో మండల పార్టీ అధ్యక్షుడు గండు రాము, ఊరుగొండలో వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, ఒగ్లాపూర్‌లో కేతిపల్లి శ్రీధర్ రెడ్డి, పులుకుర్తిలో మెంతుల రాజు, ముస్త్యాలపల్లిలో చిలువేరు రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు.

పరామర్శ



వేలేరు : మండల కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు జిల్లెల పెరుమయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆదివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్, వర్ధన్, రాజయ్య, రామంచ యేసు, వక్కల ప్రభాకర్, శంకర్ ఉన్నారు.

అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంట



దామెర: మొక్కజొన్న చేనుకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని కాలిపోయిన సంఘటన మండలంలోని కోగిల్వాయి శివారులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దండిగం కుమారస్వామికి చెందిన మొక్కజొన్న చేనుకు ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో 15 గుంటల మొక్కజొన్న పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో వెంటనే స్పందించిన రైతులు ఫైర్ ఇంజన్‌కు, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్సై కొంక అశోక్, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. స్థానిక రైతులు మాట్లాడుతూ ఎస్సై చొరవతో మంటలు త్వరగా ఆర్పివేశారని లేనిపక్షంలో చుట్టుపక్కల ఉన్న సుమారు 30 ఎకరాల మొక్కజొన్న చేలకు మంటలు వ్యాపించేవన్నారు. ఎస్సై, ఫైర్ సిబ్బందికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి



వేలేరు : పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న అన్నారు. ఆదివారం వేలేరులో బీజేపీ అభ్యర్థి అరూరి గెలుపు కోసం కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గానికి ఒక్క స్థానం కూడా ఇవ్వకుండా అవమానపరిచారని అన్నారు. మాదిగల రాజకీయ అవకాశాలు మాదిగలకు దక్కకుండా చేసిన కడియం శ్రీహరికి, ఆయన కూతురు కడియం కావ్యను చిత్తు ఓడించి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడులు బండారి సురేందర్, గద్దల సుకుమార్, జిల్లా అధికార ప్రతినిధులు గంగారపు శ్రీనివాస్, మంద వర్ధన్, కనకం రాజయ్య, రామంచ యేసు, వక్కల ప్రభాకర్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ జంక్షన్‌లో ఎలగొండ శ్రీనివాస్, కొండా రమేష్ ఆధ్వర్యంలో బాటసారులకు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, మాజీ కౌన్సిలర్ అంబి సాంబరాజు, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, పాలకుర్తి హరిప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

ఎండలతో జనం బెంబేలు

- ఉగ్రరూపం చూపుతున్న భానుడు
- నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు
- బయటకు రావాలంటేనే జంకుతున్న ప్రజలు



నిర్మానుష్యంగా ఉన్న మండల కేంద్రంలోని ఎల్కతుర్తి- సిద్దిపేట రహదారి

ఎల్కతుర్తి: వేసవి ఆరంభం నుంచే భానుడు తన ప్రతాపం (ఉగ్రరూపం) చూపుతున్నాడు. ఉదయం 11 గంటలు దాటిందంటే చాలు సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. పనులకు వెళ్లేవారు మధ్యాహ్నం 12 గంటలలోపే పనులు ముగించుకుని ఇళ్లలోకి చేరుకుంటున్నారు. అధికారుల లెక్కల ప్రకారం గత ఏడాది ఏప్రిల్‌లో ఎండ తీవ్రత 35.9 డిగ్రీలు నమోదు కాగా, ఈ ఏడాది మార్చి చివరి వారం నుంచి 38 డిగ్రీలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఇదిలా ఉండగా గత సంవత్సరం సంవృద్ధిగా కురిసిన వర్షాలకు చెరువులు కుంటలు నిండినప్పటికీ ఎండలతో చెరువులు, బావుల్లోని నీరు అడుగంటిపోతున్నాయి. పెద్దపెద్ద చెరువులు ఎడారిలా మారుతున్నాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండాల్సిన ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఊళ్లకు వెళ్లే వారు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. ఇళ్లలో ఉండే వృద్ధులు, పిల్లలు, పెద్దలు ఎండ వేడిమికి, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాదిగా మూలనపడ్డ కూలర్లు, ఏసీలు, టేబుల్ ఫ్యాన్లను వినియోగంలోకి తెస్తున్నారు. పనిచేయని వాటిని రిపేర్లు చేయిస్తున్నారు. అత్యవసరాల్లో బయటకు వెళ్లే పరిస్థితి ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలు రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో చిరువ్యాపారులు జ్యూస్ పాయింట్లు, నిమ్మరసం బండ్లు ఏర్పాటు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎండ తీవ్రత ఇప్పుడే ఇలా ఉంటే మే, జూన్ మాసాల్లో ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రధాన కూడళ్ల వద్ద ఉచిత చలివేంద్రాలు, మజ్జిక కేంద్రాలతో పాటు అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని పలువురు కోరుతున్నారు.



ఎండవేడి తట్టుకోలేక జూస్ పాయింట్లను ఆశ్రయిస్తున్న యువత

నేడు దళితుల ఆత్మీయ సమ్మేళనం

గీసుకొండ : మండలంలోని కోనాయమాకుల సమీపంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం పరకాల నియోజకవర్గ స్థాయి దళితుల (మాల, మాదిగ ఉపకులాల) ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ దళిత విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దుపాకి సంతోశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పరకాల, గ్రేటర్ లోని 15, 16, 17 డివిజన్ల కాంగ్రెస్ దళిత నాయకులు పాల్గొనాలనికోరారు.

కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని కొండపర్తి గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీ, ఇతర నాయకులు సుమారు 100 మంది కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గజ్జెల సుమన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త పాత అనే విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరు ఐకమత్యంతో పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతాంగ సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందన్నారు. ప్రతి కార్యకర్తను తాను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ వేగంగా పుంజుకుందన్నారు. సబ్బండ వర్గాలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని పార్లమెంట్ ఎన్నికల్లో కావ్య గెలుపు ఖాయమవుతుందని జోస్యం చెప్పారు. పార్టీలో చేరిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ సుల్తాన్ వెంకన్న, సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, మాదాసు బాబు, యేసేబు, మేరుగు వెంకన్న, పులిగేరు వెంకన్న, జలీల్ పాషా, మంద బాబు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సమ్మెట మహేందర్, పోలెపల్లి బుచ్చిరెడ్డి, రాయపురం సాంబయ్య, రుగ్వేద్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



దామెర : యుగేంధర్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు



శాయంపేట: చేరాలు కుటుంబ సభ్యులకు నగదు ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



కమలాపూర్: బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కాలనీ వాసులు

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన దామెర చేరాలు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా అతనితో పాటు 1986–87 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం చేరాలు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10,116ల నగదు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. అందజేసిన వారిలో జనగాం సత్యనారాయణ, గాజుల రవి, కర్రు రవికుమార్, కటకం జనార్దన్, పొన్నం రమేష్, శ్రీనివాస్, కృష్ణారావు, ప్రసాద్, శంకరయ్య, మహేందర్, గోవర్ధన్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కమలాపూర్: మండల కేంద్రంలోని పద్మశాలి మార్కండేయ పద్మనగర్ కాలనీకి చెందిన బైరి వెంకటస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి కాలనీ వాసులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులకు రూ.5,016 నగదు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కాలనీ అధ్యక్షుడు మేరుగు శివానందం, ఉపాధ్యక్షుడు బొప్ప రాజేందర్, ప్రధాన, ప్రచార కార్యదర్శి వావిలాల మురళీమోహన్, కోశాధికారి గంగుల రాజేందర్, కాలనీ వాసులు శ్రీనివాస్, శివానందం, రాజమౌళి, శేఖరయ్య, సుధాకర్, రాజేష్ తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

దామెర: మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేసి బాసటగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన దామెర ఎల్లయ్య (యుగేంధర్) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా దామెర పాఠశాలలో ఆయనతో పాటు పదోతరగతి చదివిన 1994–95 బ్యాచ్‌కి చెందిన బాల్యమిత్రులు ఆదివారం యుగేంధర్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అనంతరం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో దామెర ప్రవీణ్, వడ్డెపల్లి మోహన్, సుకినె రాజేశ్వరి, దర్శెట్టి భిక్షపతి, కూతాటి విద్యాసాగర్, అశోక్, కుమారస్వామి, వంగ రవి, మేరుగు శివ, సండెసారి సంతోష్, శ్రీను, దేవేందర్, కుమారస్వామి, బాబు, రమాదేవి, రాధిక తదితరులు ఉన్నారు.

ఎర్రబెల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేదికపై ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

వేలేరు : మండలంలోని ఎర్రబెల్లి జెడ్పీఎస్ఎస్‌లో 2005–06 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ నాటి మధుర స్మృతులు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల వల్లనే ప్రతి ఒక్కరం ఉన్నతస్థాయిలో ఉన్నామని అన్నారు. గురువులైన ప్రస్తుత వేలేరు హెచ్ఎం గౌరీశెట్టి రాజన్న, అరుణ్ కుమార్, రవీందర్ రెడ్డి, సునీత, యాకుబ్, శ్యామల, సుమ, లింగయ్యలను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడ కులస్తులు



దామెర : కాంగ్రెస్‌లో చేరిన ఊరుగొండ నాయకులతో ఎమ్మెల్యే రేవూరి

దామెర: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊరుగొండకు చెందిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లతో పాటు 100 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన నివాసంలో వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్‌లు మల్లాడి ఇంద్రారాజిరెడ్డి, జక్కుల రాణిరవీందర్, నాయకులు మాచర్ల వెంకటేశ్వర్లు, ఒడిదోలు మల్లయ్య, చిట్ల సదానందం, గొల్లపెల్లి భిక్షపతి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సంకెళ్ల చంద్రమౌళి, సాంబారి రమేష్, ఉడుత శ్రీనివాస్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపాక శ్రీనివాస్, జిల్లా నాయకులు గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, బీరం సుధాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు నల్ల సుధాకర్, కూనాటి రామకృష్ణారెడ్డి, కాణాల కిషన్‌రావు, సంది రాజిరెడ్డి, జన్ను కుమార్ ఉన్నారు.

ఆత్మకూరు: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కటాక్షపూర్, హౌజుబుజుర్గ్, నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల మెజార్టీ కంటే ఎక్కువ రావాలన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు కాలం చెల్లిందన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, జిల్లా నాయకుడు బీరం సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం నాయకుడు అర్షం వరుణ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు

పరకాల: మండలంలోని నాగారంలో రేణుకా ఎల్లమ్మ తల్లిని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారం రోజులుగా నాగారంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీకంఠమహేశ్వర, శ్రీసూరమాంబ, శ్రీమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే రేవూరితో పాటు మాజీ సర్పంచ్ సర్పంచ్ కట్కూరి స్రవంతి దేవేందర్‌రెడ్డి దంపతులను గౌడ కులస్తులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊరంతా తరలివచ్చి అమ్మవారి ప్రతిష్ఠమహోత్సవాలను నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. వేడుకల్లో గౌడ సంఘం అధ్యక్షుడు ఏరుకొండ సంతోషం, ఉపాధ్యక్షుడు మార్క శ్రీనివాస్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపునకు విస్తృత ప్రచారం



ధర్మసాగర్ : ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎస్పీ నాయకులు



ఆత్మకూరు: నీరుకుళ్లలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మసాగర్: మండలంలోని ధర్మపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపుకోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీల ఏబీసీడీల వర్గీకరణ బీజేపీ ద్వారానే సాధ్యమౌతుందన్నారు. ప్రతి ఒక్క ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుడు, కార్యకర్తలు కష్టపడి అరూరిని అధిక మెజార్టీతో గెలిపించి వర్గీకరణను సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డు శాంతిసాగర్, బాలస్వామి, కళ్యాణ్, రాజు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపు తథ్యం

దామెర: వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు తథ్యమని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు జంగిలి నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని కోగిల్వాయిలో గడపగడపకు తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు చుక్క మహేందర్, జంగిలి రాజేందర్, గడ్డం రాజేందర్, కొడారి రాజు, జంగిలి నవ్య, పాలకుర్తి శ్రీలత, పెరుగు స్పందన, జంగిలి సమ్మయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో బీజేపీ నాయకులు ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోరుతూ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కోఆర్డినేటర్ మేకల రాజవీరు, బీజేపీ మండల అధ్యక్షుడు బలవంతుల రాజు, శ్రీకాంత్, రాజ్‌కుమార్, ప్రశాంత్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా



ఖిలా వరంగల్: వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టు వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు ఏసీపీ నందిరామ్ నాయక్ తెలిపారు. నర్సంపేట రోడ్డుపై గొర్రెకుంట పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఏసీపీ ఆదివారం పరిశీలించారు. అనంతరం సీఐ మల్లయ్యతో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, రూ.50 వేలకు పైగా నగదును తరలిస్తే సీజ్ చేస్తామని అన్నారు. ఆ మొత్తానికి సంబంధించిన రశీదులు, సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మడికొండ: వాసవీ క్లబ్, వనిత క్లబ్ మడికొండ సంయుక్త ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో రాయల్ మెడికల్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని క్లబ్ బాధ్యులు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు పెద్ది సంతోష్‌కుమార్, భవాని, పెద్ది నవీన్, లావణ్య, పాలారపు కిరణ్‌కుమార్, స్రవంతి, డాక్టర్ వెంకటనారాయణ, గురుపతి, జానేశ్వర్, శంకరమూర్తి, రఘునందన్, శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోరె ఎల్లయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న నేదునూరి రాజమౌళి

ధర్మసాగర్: కామ్రేడ్ మోర పుల్లయ్య కమ్యూనిస్టు వీరుడని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ నాయకుడు నేదునూరి రాజమౌళి అన్నారు. మండలంలోని సోమదేవరపల్లిలో ఆదివారం పుల్లయ్య యాది సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అసమానతలకు సామాజిక రుగ్మతలకు, వివక్షలకు, దోపిడీకి విముక్తి కలగాలంటే భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవోద్యమం ఒక్కటే పరిష్కార మార్గమన్నారు. కార్మిక, కర్షకవర్గ పోరాటంలో ధైర్యంగా ముందుండి పోరాడిన విప్లవ వీరుడు పుల్లయ్య అని కొనియాడారు. వ్యవసాయ కార్మికుల వేతనాల పెంపు కొరకు రైతు పండించిన పంటల గిట్టుబాట ధరల కోసం కొట్లాడారని తెలిపారు. ఇనుపరాతి గుట్టల్లో ఇనుము లభిస్తుందని, ధర్మసాగర్ మండలంలోని దేవునూరు సమీపంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని గుట్టల మధ్య ఉన్నటువంటి బొర్రెను ఆధారంగా చేసుకొని రిజర్వాయర్ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని న్యాయపోరాటం చేసిన వీరుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో చల్‌పూరి ప్రభాకర్, పెద్ద రాములు,చిన్న రాములు, శ్రీదేవి, కవిత, నిర్మల, మధుర, సుజాత, అసనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపేదీ?

ఎమ్మెల్యే ఎదుట కార్యకర్తల ఆవేదన



కార్యకర్తలతో ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఏదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని రెండో డివిజన్ వంగపహాడ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తమ ఆవేదనను వెలిబుచ్చారు. వివిధ పార్టీల నాయకులను పార్టీలో చేర్చుకున్నప్పుడు కనీసం డివిజన్ నాయకులకు సమాచారం ఇవ్వరా అని ప్రశ్నించారు. అలాంటప్పుడు డివిజన్‌లో తమకు గౌరవం ఎక్కడ ఉంటోందని అడిగారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు వివిధ కారణాలతో మృతి చెందగా, వారి కుటుంబాలను పరామర్శించడానికి సమయం లేదా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. శుభ కార్యక్రమాలకు కూడా పత్రికలు ఇచ్చినా ఎందుకు హాజరుకావడం లేదని అడిగారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికై ఐదు నెలలు గడుస్తున్నా కార్యకర్తలను పట్టించుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులతో కలిసి ఫొటోకు ఫోజిచ్చారు.

విరిగిన విద్యుత్ స్తంభం



ఖిలా వరంగల్: వరంగల్ బెస్తం చెరువులోని శ్రీవెంకటేశ్వర కాలనీలో 11కేవీ విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. ప్రమాదకరమైన ఆ స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని అధికారులతో మొర పెట్టుకున్నా పట్టింకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలి దుమారానికి ఒకవేళ ఆ స్తంభం కూలిపోతే ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు.